రావిచెట్టు

గోవిందరాజు రామకృష్ణారావు

బస్సు దిగి డొంక వెంబడి మైలు దూరం ఎండలో నడిచి వచ్చేటప్పటికి నర్సింలుకి బాగా చెమటలు పోశాయి. వయసు మళ్ళటం వల్ల ఆయాసం కూడా వచ్చింది. వరండాలో చెప్పులు విడిచి ముంగిట బావిలోంచి నీళ్ళు తోడుకుని కాళ్ళూ చేతులూ కడుక్కున్నాడు.

'అప్పా!' అని కేకేశాడు తన అక్కని ఉద్దేశించి. భార్య నాంచారమ్మ లోపల్నుంచి వచ్చింది. దండెం మీదున్న తువాలు అందించింది. మంచినీళ్ళు తెచ్చిచ్చింది. నవారు మంచం వాల్చింది. తాటాకు విసనకర్రతో విసురుతూ 'అన్నీ సానుకూలం అయ్యాయా?' అడిగింది కాబోయే వియ్యాల వారి గురించి.

'ఎందుకవ్వవు అడిగినవన్నీ కాదనకుండా ఒప్పేసుకుంటే... అమ్మడేది?'

'దొడ్లో పిడకలు చేస్తోంది. ఒదిన ఎదురింటి కెళ్ళింది... కాసేపు నడుం వాల్చండి. అన్నం వార్చంగానే వడ్డిస్తా.' అని తలగడ తెచ్చి మంచం మీదపెట్టి నాంచారమ్మ లోపలికెళ్ళింది.



నర్సింలు నడుం వాల్చాడు. మనసంతా ఆలోచనలతో గజిబిజిగా వుంది. ఒకందుకు మాత్రం సంతోషంగా వుంది. అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిన కమలకి అన్నివిధాలా మంచి సంబంధం కుదరడం నిజంగా అదృష్టం. ఒక్కతె కూతురు. నలుగురు కొడుకుల తర్వాత పుట్టిన కడపటి బిడ్డ. ఊళ్ళోనే ఎనిమిదో తరగతి వరకు చదువుకుంది. పని పాట్లొచ్చు. మంచీ మర్యాదా తెలుసు. పెద్దలంటే గౌరవం ఎక్కువ. అత్తింట అనుకూలంగా అణకువతో మెలిగే తెలివితేటలున్నాయి. ఇంకేం కావాలి. చక్కగా కాపురం చేసుకోవడమే కావలసింది.

ఒకవారం రోజుల వరకు డబ్బుదో చిక్కు సమస్యగా వుండేది.

కమలకి ఈడు వస్తున్న కొద్దీ నర్సింలు దంపతులకి అమ్మాయి పెళ్ళి ఆలోచన వెంటాడేది. సంబంధాలు గురించి వాకబు చేయడం మొదలు

పెట్టారు. తూగగలమా లేదా అనే విషయం వారి మనస్సులోకి ఎన్నడూ రాలేదు. ఏవో ఉద్యోగాలు నలుగురు కొడుకులూ చేసుకుంటున్నారు. ఒక్కగానొక్క చెల్లెలు పెళ్ళికి తలా యింత వేసుకోక పోతారా అనే ధిలాసా వుండేది. సంబంధం కుదిరినట్టు రాసినప్పుడు సంతోషం, త్వరగా పెళ్ళి చేయడం మంచిదని జవాబిచ్చారు. కట్నం డబ్బు, పెళ్ళి ఖర్చు గురించి పెద్దకొడుకు గాని తక్కిన వాళ్ళు గాని ఎత్తకపోవడం బాధనిపించింది. ఇబ్బందుల్లో వున్నారంటే అది వేరే మాట. సంపాదన బాగానే వుంది. పెళ్ళి కట్నాలు దండిగా వచ్చాయి. ఇళ్ళు కూడా బస్తీల్లో అమర్చుకున్నారు. కోడళ్ళకి నగానట్రా చేయించారు. బ్యాంకులో పైకం వుంది. అయినా యింత వరకు నర్సింలు కొడుకుల దగ్గర్నుంచి చిల్లిగవ్వ కూడ ఆశించలేదు. ఆశించి తీసుకునే నైజం కాదు. ఉన్న కాస్త పొలం సాగు చేసుకుంటూ తన కష్టార్జితం పైనే జీవితం వెళ్ళబుచ్చాలని గట్టిగా కోరే మనిషి. కాని చెల్లెలి పెళ్ళి చేయడంలో నలుగురు అన్నలకూ బాధ్యత వుంది. విచిత్రంగా డబ్బు సంగతి ఎవ్వరూ ప్రస్తావించలేదు. కొడుకులపై నమ్మకంతో తాంబూలాలు కూడా పుచ్చుకున్నారు. తక్కిన వాళ్ళు ఎలా వున్నా పెద్దాడు ఆదుకుని తీరతాడని నర్సింలుకి కొండంత నమ్మకం. అన్నదమ్ములంతా ఎప్పుడు కూడబలుక్కున్నారో యేమో వ్యవహారాలు తెలిసిన చిన్నాణ్ణి పంపారు. ఆ మాటా ఈ మాటా చెప్పి చివరకి తేల్చింది – ఉన్న పొలం కాస్తా అమ్మి కమలకి ఏ లోటూ రాకుండా పెళ్ళి జరిపించమని. ఇది పిడుగు లాంటి వార్త. ప్రాణాలన్నీ పొలంలోనే భద్రపరుచుకుని నర్సింలు బ్రతుకు బండి లాగు తున్నాడు. తానూ పొలం వేర్వేరు కాదు. పొలానికి నీరు చాలినంతగా వున్నప్పుడే తన దాహం తీరుతుందను కున్నాడు. పంట సరిగా పండక పోతే తను ఆకలితో వున్నట్టే భావిస్తాడు. పంటకు ఏదైనా తెగులు సోకితే ప్రాణం విలవిల్లాడు తుంది. అలాంటి పొలం అమ్మమనే మాట కొడుకుల దగ్గర్నుంచి వచ్చింది. తమ వాటా పెళ్ళికి ఖర్చు పెట్టమని పవరు పట్టాయిచ్చినట్టు కబురు పంపారు. తర్వాత నెల నెలా తన కింత డబ్బు పంపుతారట.

కన్న బిడ్డ సుఖం కోసం ప్రాణంతో సమాన మైన పొలం అమ్మేందుకు నర్సింలు తలూపక తప్పలేదు. తన లోంచి జీవధాతువును ఎవరో హరిస్తున్నట్టు అనిపించింది. పొలం కొనే ఆసామి జాలి గుండె వున్న వాడులా వుంది. మంచి ధరే ముట్ట చెబుతున్నాడు.

పొలంలో మూడు గజాల వెడల్పున మెరక వుంది. అక్కడో రావి చెట్టుంది. ఆ చెట్టు నర్సింలుకి ఎన్నో యేళ్ళుగా చల్లని నీడ నిస్తోంది. రోజుకి ఒక్కసారైనా ఆ నీడ తనపై పడకపోతే నర్సింలుకి తోచదు. నిద్ర పట్టదు. ఆ మెరక చెక్క కూడా అమ్మేస్తే ఈ ప్రపంచంలో తన కంటూ స్వంత పొలం అన్నది వుండదు. కొనే ఆసామికి మెరక చెక్క మీద మక్కువ లేదు. తక్కువ ధర యిస్తాననడం సబబే. అయితే మెరక చెక్క కూడా అమ్మక పోతే పిల్ల కిచ్చే బంగారానికి పైకం తక్కువ పడుతుంది. ఆ మెరక చెక్క సంగతి తప్ప అంతా కరారై పోయింది. పొలం పంట పైన వుంది నిండు చూలాలి మాదిరి. పంట కోతలు అవ్వంగానే పొలం స్వాధీనం చేయాలని ఒప్పందం కూడా కుదిరింది. నర్సింలు ఎటూ తేల్చుకో లేకుండా వున్నాడు.

కళ్ళు మూసుకుని పడుకున్న భర్తను చూసి "కునుకు పట్టి నట్టుందే. వంటయింది. నాలుగు మెతుకులు తిని పడుకో! బడలిక తీరుతుంది" భుజం తట్టి లేపింది.

"నిద్రా, నా మొహమా. ఊరికే పడుకున్నా. వడ్డించు."

లేచి లోపలి కెళ్ళాడు.

భోజనం చేస్తుండగా నర్సింలు అక్క రంగమ్మ ఎదురింటి నుంచి వచ్చింది. రంగమ్మకి భర్త పోయి చాల కాలమయింది. పిల్ల ల్లేరు. భర్త వైపు దగ్గర బంధువులు ఎవరూ లేరు. ఆస్తి కూడా లేదు. ఏవో నగలు మాత్రం వున్నాయి. చేతనైన పనిపాట్లు చేస్తూ యింట్లో పెద్ద దిక్కుగా వుంటోంది.

పలకరింపుగా "ఏరా నర్సన్నా! వెళ్ళిన పని అయిందా?" అని అడిగింది.

"అవునే అప్పా! ఇక మనదే ఆలస్యం పెళ్ళికి" అన్నాడు.

"నువ్వు భోజనం కాని. తర్వాత మాట్లాడు కుందాం" అంటూ పెరట్లోకి వెళ్ళింది పని మీద.

బంగారానికి సర్దుబాటు అయితే గట్టెక్కినట్లే అనిపిస్తోంది నర్సింలుకి. మెరక చెక్క కూడా అమ్మేస్తే డబ్బు సమకూరుతుంది. కాని ఎలా అమ్మడం.

అందరి భోజనా లయ్యాక రంగమ్మ, నాంచారమ్మ వరండాలో నడుం వాల్చిన నర్సింలు దగ్గరి కొచ్చారు. కమల పక్కింటి స్నేహితురాలి దగ్గరి కెళ్ళింది.

తమ్ముడు ఏదో సమస్యతో సతమత మవుతున్నాడని గ్రహించి రంగమ్మ, "నర్సన్నా! మరి పెళ్ళికి అంతా సర్దుబాటయినట్లేనా?" అడిగింది సంగతి తెలుసుకోవాలనే వుద్దేశంతో. తాను మథన పడుతున్న విషయం ఎలా చెప్పాలో తెలియక గాంభీర్యం సడల కుండా–

"అయినట్లేనే అప్పా" జవాబిచ్చాడు.

తమ్ముడి తత్వం ఎరిగిన రంగమ్మ "పొలం అయినకాడికి అమ్ముకున్నా అటు కట్నం కానుకలికి ఇటు పెళ్ళి ఖర్చుకి చాలొద్దురా?" సందేహం వెలిబుచ్చింది.

"చాలడం అంటే అంతెక్కడే అప్పా సర్దుకోవాలి మరి" సమాధానం చెప్పాడు.

ఇంతలో నాంచారమ్మకి ఒక అనుమానం కలిగింది. "మనం సర్దుకుంటాం. మరి మగ పెళ్ళివారు వూరుకుంటారా? కట్నం రూపాయి తగ్గరు. అమ్మాయికి పెడతామన్న బంగారం వీసమెత్తు తగ్గితే ఒప్పుకోరు. మనం లోకంలో చూస్తున్నదే. తెలిసుండి మనం పెళ్ళిలో వెలితి చేయకూడదు." హెచ్చరింపుగా చెప్పింది.

కొద్దిసేపు ఎవరూ ఏమీ మాట్లాడ లేదు. నర్సింలు గొంతు సరిచేసుకుంటూ నీళ్ళు నములు తున్నట్టు, "కట్నం కానుకలికి, పెళ్ళి ఖర్చుకి సరిపడా వుందిలే..." అని ఆగాడు.

"మరి బంగారం ముఖ్యం కదరా!.... అక్కడే గొడవ లొచ్చేది. ఏమాత్రం లోటు జరిగినా కాపురాని కెళ్ళాక బిడ్డ యాతన పడుతుంది." చెప్పింది రంగమ్మ.

"నా మెళ్ళో వున్న గొలుసు ఇచ్చేస్తా. పోతే, ఆ కాస్త మెరక స్థలం ఏం చేసుకుంటాం.... దాన్ని కూడా అమ్మేస్తే శుభకార్యం సజావుగా జరిగి పోతుంది" సలహా యిచ్చింది నాంచారమ్మ.

నెత్తి మీద పిడుగు పడ్డట్టు, "మెరక చెక్కా!" నర్సింలు గొంతు వణికింది.

నాంచారమ్మ అర్థం చేసుకుని, "అవును అమ్మడి పెళ్ళి కంటె మనకీ చెక్క ముఖ్యమా?" అంది అనునయంగా.

"కాదనుకో.... కాని ఆ కాస్త నేల కూడా లేకపోతే....?"

"ఏమవుతుంది? ఉన్న పొలం అంతా అమ్ముకుంటే లేంది ఈ కాస్త చెక్క అమ్మితే ఏం మునుగుతుంది.

'కలం స్వాగతం'

రండి... నాతో రండి
ఆదిమానవుని ఆంతర్యంలోకి
నిష్క్రమింపజేస్తాను
రండి... నాతో రండి
విభయ్యవ శతాబ్దంలోకి
తీసుకు వెడతాను-
రండి... నాతో రండి
యుగాల గత చరిత్రను
మీ ముందు నిలబెడతాను...
భవిష్యత్తు ఖజానాను
మీ కనుల ఎదుట ఆవిష్కరిస్తాను!
నిన్నలో ఊపిరి పోసుకుని
నేటిలో అనుభూతులందుకుని
రేపటిలోకి తొంగి చూస్తూ
ఆగమన సూర్యుని ఆవలికి
తీసుకుపోతాను-
గతం నుండి అనాగతంలోకి ఆగమిస్తూ
అనంతం వైపు ప్రస్థానిస్తాను!!

–ఝాన్సీ కె. వి. కుమారి

తర్వాత దేవుడే వున్నాడు "

భార్యాభర్తలు మాటలు విన్న రంగమ్మ "ఒరే నర్సన్నా! నాకు తెలుసురా ఆ మెరక, ఆ రావి చెట్టు అమ్మొద్దురా అమ్మడు నీ కెంతో నాకూ అంతేరా కన్నది నాంచారమ్మే అయినా పెంచి పెద్ద చేసొంది నేనేరా" అంది

కాదని ఎవరన్నా రప్పా!

అన్నేదురా అందుకనే నా నగలన్నీ మార్పించి మాట ప్రకారం దానికి బంగారం ముట్ట చెబుతాం నాకీ నగ లెందుకురా' ఎప్పటికైనా దాని కివ్వవలసిందేగా' నిబ్బరంగా చెప్పింది

ఒదినా' నీ నగ లిప్పుడివ్వడం ఎందుకు? అని నాంచారమ్మ అనగానే, 'మరెప్పు డివ్వాలి నువ్వూరుకో ఇంకేం అడ్డు చెప్పకు నర్సన్నా' వెంటనే నగలు చేయించే ఏర్పాటులో వుండు కాదనకు కచ్చితంగా ఆదేశించినట్టు చెప్పింది

ఎదో చెప్పబోతున్నట్టు, అప్పా' అనంగానే, నాకేం చెప్పొద్దురా నేనెప్పుడో నిర్ణయాని కొచ్చాను మీరేం చెప్పినా వినిపించుకోను అని లోపలి కెళ్ళి పెట్లోంచి నగల మూట తెచ్చి నర్సింలు చేతిలో పెట్టింది

* * * * *

ఊరూ వాడా సంక్రాంతి సంబరాలు జరుపుకుంది నర్సింలు పండక్కి అల్లుణ్ణీ కూతుర్నీ తీసుకొచ్చి శక్తి కొద్దీ సంతోషపెట్టి పంపాడు పెళ్ళి వైభవంగా జరపడమే కాకుండా సంక్రాంతికి కూడా బాగానే ముట్ట చెప్పినందుకు వియ్యాల వారు సంబరపడి పోయారు వాళ్ళు సంతోషపడడమే తమక్కావల్సిందని నర్సింలూ నాంచారమ్మా పదే పదే అనుకున్నారు

నిజానికి చుట్టు పట్ల పిల్ల పెళ్ళి అంత ఘనంగా చేసిన ఖ్యాతి నర్సింలుకే దక్కింది పెద్ద పెద్ద పందిళ్ళు వేసి, అట్టహాసంగా అలంకరణ చేయించి, పూలతో మెరిసే దండలతో మంటపం కట్టించి, పట్నం నుంచి మంచి బ్యాండు మేళం తెప్పించి పెళ్ళి జరిపించాడు కూతురు పెళ్ళి అంత వైభవంగా జరపడం ఏ తల్లిదండ్రులకు ఆనందం కాదూ' దీనికి తోడు ఉన్న పొలం అమ్మినప్పుడు ఏర్పాట్లలో ఏ లోపం వచ్చినా కావాలని డబ్బు మిగుల్చు కున్నట్టు ఎక్కడ కొడుకులు నెపం వేస్తారోనని మరింత జాగ్రత్త పడ్డాడు పొలం అమ్మిన సొమ్ము పెళ్ళికి తాము యిచ్చినట్టు నలుగురు కొడుకులు అందరికీ చెప్పారు నర్సింలు కాదన లేదు కొడుకుల మీద ఈగ వాల్తే వూరుకునే తత్వం కాదు

పెళ్ళి సందడి సద్దు మణిగాక పంట కోత లయ్యాయి ధాన్యం యింటి కొచ్చింది కొత్త అల్లుడికి లాంచనాలు యదావిధిగా జరిపించాడు

ఇవన్నీ వాస్తవానికి ఆనంద పరచేవే కాని నర్సింలు సంగతి వేరు పొలం అమ్మకం అయిపోయింది రిజిస్ట్రీ అయిన వెంటనే పొలం స్వాధీన పరచుకునే వీలున్నా కొన్న ఆసామి నర్సింలు మీద వుండే గౌరవంతో ఈ గడువుకు సమ్మతించాడు ఒక్కొక్క రోజు గడుస్తున్న కొద్దీ నర్సింలుకి జవసత్వాలు హరించుకు పోతున్నట్టు అనిపిస్తోంది

పొలం అప్పగించ వలసిన రోజు రానే వచ్చింది తెల్లవారు ఝామునే లేచి కాలకృత్యాలు తీర్చుకున్నాడు ఎన్నడూ లేంది నర్సింలు అంత పొద్దున్నే స్నానం చేయడం గమనించి, ఆశ్చర్యపోయి, ఇప్పుడు స్నానం ఏంటయ్యా అని అడిగింది నాంచారమ్మ

పొలానికి వెళ్తున్నా ఇవ్వాళ అప్పగింత పెట్టాలి '

అయితే స్నానం ఎందుకు?

'నీకు తెలియదులే వూరుకో
నాంచారమ్మ బదులు పలక లేదు

పొలానికి బయలుదేరే ముందు నాంచారమ్మతో, రంగమ్మతో వెళ్ళొస్తానని మరీ మరీ చెప్పాడు

నర్సింలు బాధ ఎరిగిన భార్యా, అక్కా, ఆ భగవంతుడే మనల్ని చల్లగా చూస్తాడు అమ్మిన పొలం కొన్న వాళ్ళదే అని నచ్చ చెప్పి పంపారు

దార్లో గన్నేరు పూలు దండిగా కోసుకొని కండువాలో మూట కట్టుకుని గబగబా నడుచుకుంటూ పొలం చేరుకున్నాడు

పొలం అంతా కలియ తిరిగాడు చుట్టుపట్ల ఎవరూ లేరు అనేక సార్లు మట్టి తీసి కళ్ళ కద్దుకున్నాడు కన్నీళ్ళు దార కట్టాయి మట్టి తడిసింది తెచ్చిన పూలు పొలంలో దేవుడి పాదాలకు పూజ చేస్తూ అర్పిస్తున్నట్టు భక్తితో నాలుగు వైపులా వుంచాడు పొలానికి మధ్యలో నిలబడి ప్రదక్షిణ చేస్తూ చేతులు జోడించి నమస్కరించాడు

పొలం కొన్న ఆసామి నాగలితో పాలేళ్ళతో వచ్చాడు నర్సింలు వినయంగా అతనికి నమస్కరించాడు అయ్యా! ఇదిగో మీ పొలం మీ కప్పగిస్తున్నాను ఇంత కాలం నేను కాపాడాను ఇప్పుడు మీ చేతుల్లో పెడు తున్నాను అని కన్న కూతురుని అప్పగించి నట్టు పొలం స్వాధీన పరచాడు

పాలేళ్ళతో పొలం దున్నడం, దుక్కి చేయడం మొదలు కుప్ప నూర్పుల వరకు తీసుకో వలసిన జాగ్రత్తలు చెప్పాడు

నాగలి కర్రు నేలలోకి దిగగానే నర్సింలు పొలంలోంచి మెరక మీదికి ఎక్కి రావిచెట్టు క్రింద చతికిల పడ్డాడు అది తరతరాలుగా వస్తున్న పొలం తాను పుట్టినప్పటి నుంచి చూస్తున్న నేల ఇన్నేళ్ళుగా తన కుటుంబానికి అన్నం పెడుతున్నది ఈ పొలమే తన ప్రాణాలన్నీ దాచుకున్నది ఈ పొలంలో నే

తూర్పు దిక్కున సూర్యుడు పెద్ద ఎర్రబంతి పువ్వులా పైకి వస్తున్నాడు ప్రపంచం అంతటికీ వెలుగు ఇస్తున్నాడు కాని నర్సింలు మనసంతా చీకటి మయ మయింది కళ్ళు తెరుచుని వున్నా ఏమీ కనిపించడం లేదు నల్లటి పర్వతం లాంటి ఏనుగు తన గుండెపై పాదం పెట్టి తొక్కుతున్నట్టయింది ఆ బాధకు ఓర్చుకోలేక గుండె చేత్తో పట్టుకుని పక్కకు ఒరిగి పోయాడు

రావి కొమ్మల్లోంచి సూర్య కిరణాలు భుజం తట్టి లేపేందుకు ప్రయత్నించాయి నర్సింలు ప్రాణాల్ని తనలో కలుపుకున్న గాలి సూర్యకిరణాల్ని అపహసిస్తున్నట్టు రావి ఆకులు గలగల మన్నాయి

* * * * *

ఇప్పుడా రావి చెట్టు క్రింద పెద్ద తులసి కోట అందమైన అరుగు చూపరుల్ని ఆకట్టు కుంటాయి తండ్రిపై నలుగురి కొడుకులికి వున్న ప్రేమాభిమానాలకు దానిని నిదర్శనంగా ప్రజలంచరూ భావిస్తారు ◻